# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 06 పేజీలు - 6 శనివారం 30 నవంబర్ 2024

## అదుపు తప్పి హైవే బ్రిడ్జి అంచుకు ఆర్‌టీసీ బస్సు

● ప్రయాణికులకు గాయాలు

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** జాతీయ రహదారి 161పై ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం కన్సాన్ పల్లి దగ్గర శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సు బ్రిడ్జి రెయిలింగ్ పైకి ఎక్కి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం అందిన వెంటన పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన ప్రయాణికులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ప్రయాణికులను వేరే బస్సుల్లో వారి గమ్య స్థానాలకు చేర్చారు.



## ఇందిరమ్మ ఇళ్లపై

# సీఎం రేవంత్ సమీక్ష !

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యక్రమం ఎంచుకోవాలని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో సమావేశ మయ్యారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతో పాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని.. ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగవద్దని.. అదే సమయంలో శాఖపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సమర్థమంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలని, ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ పాల్గొన్నారు.



● పరిస్థితుల కారణంగా మరోసారి పోరుబాట

● రాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి అనన్యసామాన్యం : మాజీ మంత్రి కేటీఆర్

## తెలంగాణ రాష్ట్ర సమితికి

# జన్మస్థలం కరీంనగర్

**తొలి అక్షరం/కరీంనగర్, నవంబర్ 29:** తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అనిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని తెలిపారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే

వివరాలు 2లో

## ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి

- ● పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరం
- ● పార్టీ విజయమే తమ గెలుపుగా భావించాలి
- ● పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుంది
- ● మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆశించినట్లుగా లేవు
- ● ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది
- ● పార్టీ బలోపేతానికి కఠిన నిర్ణయాలు తప్పవు
- ● ఈవీఎంలపై పలు అనుమానాలు ఉన్నాయి
- ● కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ● సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక నిర్ణయాలు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, నవంబర్ 29:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కఠిన నిర్ణయాలు అవసరమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఈవీఎంలపై కూడా పలు అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం దిల్లీలో జరిగిన

వివరాలు 2లో

## పెద్దపులి దాడిలో మహిళ మృతి

**తొలి అక్షరం/ఆసిఫాబాద్, నవంబర్ 29:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులి దాడిలో మహిళ మృతిచెందింది. శుక్రవారం ఉదయం కాగజ్‌నగర్ మండలం నజ్రుల్ నగర్‌లో వ్యవసాయ పనులకు వెళ్తుండగా మహిళపై పులి దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. తోటి కూలీలు కేకలు వేయడంతో అది పారిపోయింది. వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలిని గన్నారం వాసి మోర్లె లక్ష్మీగా (21) గుర్తించారు.



మృతదేహంతో కాగజ్‌నగర్ అటవీ కార్యాలయం ముందు ఆమె బంధవులు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు

వివరాలు 2లో

## మండలి ఎన్నికలకు రంగం సిద్ధం

● ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్ల స్థానాలకు ఎంపిక మొదలు ● ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి సీనియర్ నేత జీవన్‌రెడ్డికే ఛాన్స్ ● ఏకగ్రీవంగా తీర్మానం చేసిన టీపీసీసీ




## రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ సక్సెస్

● సిద్దిపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన హరీశ్‌రావు




## పెరిగిన చలి తీవ్రత

● న్యాల్కల్‌లో 7.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతగా నమోదు



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** రాష్ట్రంలో చలి తీవ్రత పెరగుతున్నది. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్కల్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం ఉదయం న్యాల్కల్‌లో 7.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. కోహిర్‌లో 9.2 డిగ్రీలు, గుమ్మడిదలలో 9.2, సత్వార్‌లో 9.3, మెదక్ జిల్లా శివ్వంపేటలో 8.9,

వివరాలు 2లో

## ప్రారంభానికి సిద్ధమైన

# చర్లపల్లి రైల్వే స్టేషన్

- ● రూ. 428 కోట్లతో స్టేషన్ అభివృద్ధి
- ● 19 లైన్ల సామర్థ్యంతో 10 కొత్త లైన్లు ఏర్పాటు
- ● నేడు ప్రారంభించనున్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
- ● నేటి నుంచే ప్రయాణికులకు అందుబాటులోకి..

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** అత్యాధునిక హంగులు, సకల వసతులు, రూ.428 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి సిద్ధమైంది. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను నేడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించనున్నారు. దీంతో నేటి నుంచే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైల్వేస్టేషన్ మీదుగా ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు తోడు.. మరో 25 జతల రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. వాస్తవానికి ప్రధాని మోదీ దీన్ని ప్రారంభిస్తారని మొదట్లో చెప్పారు. కానీ.. ఇప్పుడు రైల్వే మంత్రి ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త టెర్మినల్ ఓపెన్ అయ్యాక హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గే అవకాశం ఉంటుందని రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తం రూ. 428 కోట్లతో ఈ



స్టేషన్‌ను అభివృద్ధి చేశారు. ఐదు లిఫ్టులు, ఐదు ఎస్కలేటర్లు ఏర్పాట్లు చేశారు. మొత్తం 19 లైన్ల సామర్థ్యంతో 10 కొత్త లైన్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా భవనం, సౌందర్య వంతమైన ముఖ్య ద్వారం నిర్మించారు. ఈ స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్లో ఆరు టికెట్ బుకింగ్ కౌంటర్లు, లేడీస్ వెయిటింగ్ హాల్, పురుషుల వెయిటింగ్ హాల్,

వివరాలు 2లో

## లగచర్ల భూసేకరణ నిలిపివేత

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** గిరిజన, దళిత పేద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ చేసిన పోరాటంతో రేవంత్ రెడ్డి సర్కార్ దిగొచ్చింది. లగచర్ల భూసేకరణను నిలిపివేసింది. ఈ మేరకు శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. లగచర్ల ఫార్మాపై అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై రైతుల దాడి ఘటనను ముందుగా పసిగట్టలేకపోవడం నిఘా వైఫల్యమేనన్న విమర్శలు వెల్లువెత్తాయి. లగచర్ల ఘటన అనంతరం అరెస్టులు, పోలీసుల మోహరింపులతో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నది. అర్ధరాత్రి వేళ రేవంత్ సర్కార్ అండతో పోలీసులు చేసిన దమనకాండతో రాష్ట్రం అట్టుడికింది. దీంతో బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. వారిని జాతీయ మానవ హక్కుల కమిషన్ దగ్గర వరకూ తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్‌ఆర్సీ దీనిపై విచారణ కూడా చేపట్టింది. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం గమనార్హం.

## పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. లగచర్ల ఘటనకు సంబంధించి ఆయనపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లలో రెండింటిని హైకోర్టు కొట్టేసింది. ఒక కేసును మాత్రం కొట్టివేయకుండా వదిలేసింది. లగచర్ల ఘటన నేపథ్యంలో బొంరాస్‌పేట పోలీసులు నరేందర్ రెడ్డిపై మొత్తం మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపి తీర్పును రిజర్వ్‌లో పెట్టిన హైకోర్టు శుక్రవారం ఉదయం తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

## పెరిగిన చలి తీవ్రత

(మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.9 డిగ్రీలు నమోదయింది. ఇక ఆదిలాబాద్‌లో 9.7 డిగ్రీలు, పటాన్‌చెరులో 12.2, హనుమకొండలో 13.5, రామగుండంలో 13.8, నిజామాబాద్‌లో 14.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కాగా, రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదు కావడం చలి తీవ్రతకు అద్దంపడుతున్నది. ఉదయం 8 దాటినా ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకుని కాచుకుంటున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా భీమ్‌పూర్–టీలో అత్యల్పంగా 8.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 8.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 9.4 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేటలో 9.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా జుక్కల్‌లో 10.4 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కోట్‌గిరిలో 10.4, కొండపాకలో 10.6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబిలో 10.7 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మరిపల్లిలో 10.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ప్రారంభానికి సిద్ధమైన చర్లపల్లి రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఎగువ తరగతి వెయిటింగ్ హాల్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, మొదటి అంతస్తులో కేఫ్టేరియా, రెస్టారెంట్, స్త్రీలు, పురుషుల కోసం విశ్రాంతి గదులు ఉంటాయి. స్టేషన్ ముఖద్వారానికి అత్యాధునిక లైటింగ్‌వ్యవస్థ ఏర్పాటు చేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైన నేపథ్యంలో.. రైల్వే బోర్డు పలు అనుమతులు ఇచ్చింది. చర్లపల్లి స్టేషన్ నుంచి 6 ఎక్స్ ప్రెస్ రైళ్లను నడిపేందుకు అనుమతి వచ్చింది. మరో 12 రైళ్లు ఈ స్టేషన్‌లో ఆపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీన్ని ప్రారంభించిన తర్వాత ఇక్కడి నుంచి రైళ్లను నడిపేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సిద్ధం అవుతున్నారు.

## పెద్దపులి దాడిలో మహిళ మృతి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. కాగా, ఆసిఫాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా పెద్దపులి కలలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. గురువారం ఉదయం వాంకిడి మండలంలోని సోనాపూర్ అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడిచేసింది. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. గత ఆదివారం కూడా మండలంలోని దాబా, బండకాస గ్రామంలో కోర్ డోబ్రాలొద్ది ప్రాంతంలో ఆవుల మందపై పులిదాడి చేసింది. ఈ దాడిలో ఒకఆవు మృతిచెందగా మరో రెండుఆవులకు తీవ్ర గాయాలు అయ్యాయి. బండకాస గ్రామానికి చెందిన పశువుల కాపరి సోయం బాబురావు ఆదివారం మధ్యాహ్నం గ్రామసమీపం లో పశువులను మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం పులి పశువుల మందపై దాడిచేసింది. పశువుల కాపరి పులిని చూసి భయందోళనకు గురై గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమా చారం అందించారు. అనంతరం వారు వచ్చి ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పులి పశువుల మందైప దాడి చేయడంతో సమీపప్రాంతాల గిరిజన రైతులు భయాందోళకు గురవుతున్నారు.



## తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్

(మొదటి పేజీ తరువాయి)

ఉందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు కానీ.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని చెప్పారు. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లమని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. హాస్టల్‌లో బువ్వ తిని ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే నాలుగేళ్లు ప్రజల పక్షాన ఉద్యమిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని దెబ్బ తగలడంపై కాంగ్రెస్ లోతుగా విశ్లేషిస్తోంది. పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వంటివి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాయని, ఈ విషయంలో కఠిన క్రమశిక్షణ అవసరమని ఖర్గే అభిప్రాయపడ్డారు. కలిసికట్టుగా పోరాడకుండా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుంటే ప్రత్యర్థులను ఎలా ఓడించగలం? అని ప్రశ్నించారు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్న ఖర్గే, ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు హితబోధ చేశారు. "పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరం. ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. ఇండియా కూటమి పార్టీలు నాలుగు రాష్ట్రాలకు గాను రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. కానీ మన పార్టీ పనితీరు ఆశించిన విధంగా లేదు. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది" అని ఖర్గే తేల్చి చెప్పారు."సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతం చేసేందుకు నేతలంతా మరింతగా కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు కచ్చితంగా ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (%జుఎవీ%) ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఎలక్షన్ కమిషన్? వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి సాధించిన ఫలితాలు, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోని ఫలితాలు చూసి రాజకీయ విశ్లేషకులు కన్‌ఫ్యూజన్‌లో పడ్డారు" అని ఖర్గే అన్నారు. "కాంగ్రెస్ కచ్చితంగా ఎన్నికల వ్యూహాన్ని మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్‌ను మెరుగుపరిచేందుకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడానికి మెరుగైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి. దేశంలో ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్? పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఇది పెద్ద కుదుపే అని చెప్పవచ్చు. కనుక పార్టీ బలోపేతానికి కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందడం కాకుండా, పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.

## మండలి ఎన్నికలకు రంగం సిద్ధం

- ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్ల స్థానాలకు ఎంపిక మొదలు
- ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి సీనియర్ నేత జీవన్‌రెడ్డికే ఛాన్స్
- ఏకగ్రీవంగా తీర్మానం చేసిన టీపీసీసీ

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** తెలంగాణలో మండలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్ల స్థానాలకు ఎంపిక షురూ అయ్యింది. కరీంనగర్–నిజామాబాద్–మెదక్–ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి సీనియర్ నేత జీవన్‌రెడ్డికే ఛాన్స్ ఇవ్వాలని తీర్మానం చేసింది టీపీసీసీ. వచ్చే ఏడాది శాసనమండలిలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఒకటి గ్రాడ్యుయేట్ కాగా, మరో రెండు టీచర్ల స్థానాలు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా మరోసారి సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరును ఖరారు చేయాలని కాంగ్రెస్ ముఖ్యనేతలు పార్టీ హైకమాండ్‌ను కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. గురువారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశానికి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సహా సీనియర్ నాయకులు హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పలువురు మంత్రులు హాజరయ్యారు. జీవన్ రెడ్డి పోటీకి రెడీగా ఉంటే ఆయన పేరు హైకమాండ్ కు పంపిస్తామన్నారు అధ్యక్షుడు మహేష్ కుమార్. ఒకవేళ ఆయన పోటీకి ఆసక్తి చూపకుంటే మరో అభ్యర్థి ఎంపిక కోసం ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. అప్పుడు సీనియర్ మంత్రులతో కలిసి ఓ కమిటీ వేస్తామన్నారు. ఈలోగా సాధ్యమైనంత ఎక్కువమంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు




చేయించేలా ఆ జిల్లాల ఇన్ ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జీవన్‌రెడ్డి 2018లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వచ్చే ఏడాది మార్చితో ఆయన పదవీకాలం ముగియనుంది. ఎమ్మెల్సీ ఎన్నికలను అధికార పార్టీకి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం 42 అసెంబ్లీ సెగ్మెంట్‌లను కలిగి ఉంది. పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించింది టీపీసీసీ.

## రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ సక్సెస్

- సిద్దిపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన హరీశ్‌రావు



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ జరుపుతున్నాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని రంగదాంపల్లిలో అమరులవీరుల స్థూపం దగ్గర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, ఇతర నేతలు దీక్షా దివస్ నిర్వహించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుగుతోంది. మెదక్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు జరుగుతున్నాయి. జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు.

## ములుగులో ఉద్రిక్తత

- బీఆర్ఎస్ జెండాలను తొలగించిన గ్రామ పంచాయతీ అధికారులు

**తొలి అక్షరం/ములుగు, నవంబర్ 29:** ములుగు జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత ఏర్పడింది. దీక్షా దివస్ నేపథ్యంలో టౌన్‌లోని బస్టాండ్ నుంచి సాధన స్కూల్ వరకు జాతీయ రహదారి డివైడర్‌కు ఇరువైపులా బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ జెండాలు, తోరణాలు కట్టారు. అయితే అనుమతి లేకుండా జెండాలు పెట్టారనే కారణంతో శుక్రవారం తెల్లవారుజామున గ్రామపంచాయతీ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడి చేరుకుని.. సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో వారు తోరణాలను తొలగించడాన్ని ఆపేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి, పార్టీ నాయకులు పోరిక గోవింద్ నాయక్, విజయరామ్ నాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ జెండాలు, కేసీఆర్ ఫొటోల తొలగింపుపై తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు వస్తే బ్యానర్లు ఉంటయి, రాహుల్ గాంధీ వస్తే బ్యానర్లు ఉంటయి, సీఎం సోదరుల పుట్టిన రోజు బ్యానర్లు ఉంటయి, డిప్యూటీ సీఎం భార్య బ్యానర్లు ఉంటయి. వీళ్లకు పర్మిషన్లు ఉండవు, ఆంక్షలు ఉండవు. కానీ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన కేసీఆర్ ఆమరణ దీక్ష రోజైన దీక్షా దివస్ బ్యానర్లు మాత్రం తొలగిస్తారా అని మండిపడుతున్నారు. తెలంగాణకు అడ్డం పడ్డోళ్లకు తెలంగాణలో చోటుంటది కానీ, రాష్ట్రాన్ని సాధించిన తొలి సీఎంకి చోటు లేదా అని ప్రశ్నిస్తున్నారు.

## కేసీఆర్ పోరాటం ఎప్పటికీ గుర్తుండిపోతుంది : ఎర్రబెల్లి దయాకర్‌రావు

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 29:** కేసీఆర్ పోరాటం ఎప్పటికీ గుర్తుండిపోతుందని, తెలంగాణ ఉద్యమ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు. తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కానీ ఇవాళ తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డలపై తుపాకీ పట్టుకుని తిరిగి.. నేడు తుపాకీరాముడు ముచ్చట్లు చెబుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి మండిపడ్డారు. త్వరలోనే తుపాకీ రాముడి తుప్పును ప్రజలు వదలగొడతారని విమర్శించారు.



# టిఆర్ఎస్ ది దీక్ష దివాస్ కాదది..దివాలా దివాస్..!!

**- డిసిసి ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్ ..**



**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 29:** టి ఆర్ ఎస్ పార్టీ చేయవలసిన దీక్ష దీక్ష దివాస్ కాదని,దివాలా ధివాస్ అని డీసీసీ ఉపాధ్యక్షులు భూక్యా బాలాజీ నాయక్ ఎద్దేవా చేశారు.శుక్రవారం ఆయన తొలి అక్షరం ప్రతినిధి తో మాట్లాడుతూ ,టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు దీక్ష దివాస్ చేయాలని పిలుపు నియడం హాస్యాస్పదమన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కిందని దానికి ఆస్కార్ అవార్డుకు కేసీఆర్ ను ఎంపిక చేసిన సందేహం లేదని అన్నారు. వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి తాగుబోతులను చేసిన కెసిఆర్,పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రజలు విసుగు చెంది టి ఆర్ ఎస్ పార్టీని పది నెలల క్రితమే బండ కేసి బాధార న్నారు.ప్రజా పాలనలో అభివృద్ధికి చూసి కేటీఆర్,హరీష్ రావు, అడ్డుపడుతున్నారని, దీక్షల పేరుతో ఇంకా తెలంగాణ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రజా సంక్షేమ పథకాలతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదని అన్నారు.ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.

# చెకుముఖిలో జిల్లా స్థాయిలో బహుమతి పొందిన సిద్ధార్థ విద్యార్థులు



**తొలి అక్షరం/చెన్నారావుపేట, నవంబర్ 29:** చెకుముఖిలో జిల్లా స్థాయిలో బహుమతి పొందిన సిద్ధార్థ విద్యార్థులు చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ చెందిన విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలు లో భాగంగా జిల్లాస్థాయిలో బహుమతులు సాధించినట్లు సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన తూర్పాటి యశ్వంత్, అక్కనపెల్లి అనీష్, . పతంగి శశాంక్ అనే అనే విద్యార్థులు నర్సంపేట లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ బహుమతి సాధించడం జరిగింది. విద్యార్థులను సన్మానించడం జరిగింది. హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి. మేడి రమేష్ గౌడ్, దామెర గణేష్ , వల్ల వేణు. విష్ణు. పరమేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.

## నాపై నమ్మకం ఉంచి LHPS మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎనుకున్న రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు

**- రాజు నాయక్‌కు నియమ్మక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్**

**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 29:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షునిగా వరుసగా నాలుగవసారి జరుపుల రాజు నాయక్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజు నాయక్ కి నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను కేశంపేట మండలం ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షులుగా వరుసగా నాలుగవసారి నియమించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అహర్నిశలు కృషి చేస్తూ అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చి నమ్మకంగా పనిచేస్తానని అన్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** పాలకుర్తి మండల కేంద్రంలోని స్థానిక ఎంమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు మంజూరైన 87,10,092 రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన స్థానిక పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ, అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు,రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు, నిరుపేదలు ఆసుపత్రిలో ఆపద కాలంలో ఖర్చుపెట్టిన సొమ్మును ముఖ్యమంత్రి దయంత హృదయంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తిరిగి చలిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మంజుల భాస్కర్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, కుమారస్వామి, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు

# కంటాయపాలెం లైన్మెన్ పొంతన లేని సమాధానంతో కస్న తండా రైతుల ఇబ్బందులు


- జంపర్ తెగిపోయి విద్యుత్ లేక నార్లు ఎండిపోయి నష్టపోతున్న రైతులు
- జంపర్ కనెక్షన్ ఇచ్చి మాకు విద్యుత్ సరఫరా చేయాలని కస్న తండ రైతుల వేడుకోలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కంటాయపాలెం గ్రామం కస్నా తండా శివారులో జంపర్ తెగిపోయి 15 రోజులు దాటుతున్నప్పటికీ కంటాయపాలెం లైన్మెన్ నిర్లక్ష్యంతో... ఫోన్ చేస్తే పొంతనలేని సమాధానాలతో కాలం వెళ్లబుచ్చడం తప్ప కనెక్షన్ ఇవ్వకపోవడంతో నార్లు ఎండిపోయి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆరోపిస్తున్నారు. తండా శివారులోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కింద 15 నుండి 20 ఎకరాల సాగుభమి ఉందని వరి కోసిన తర్వాత నాలుగు రోజుల క్రితం నార్లు పోసి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటర్లు నడవక నీరు అందక ఎండిపోతుందని... మళ్లీ విత్తనపు వడ్లకే 30 వేల రూపాయల పెట్టుబడి పెట్టి నష్టపోవడమే కాకుండా మళ్లీ 30 వేల రూపాయలు పెట్టి విత్తనపు వడ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న లైన్మన్, అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయంపై స్థానిక విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి కి ఫోన్ చేసి కంటాయపాలెం లైన్మెన్ రైతులతో పొంతన లేని సమాధానం చెప్పటకే కాకుండా నీకు పై అధికారులు బాగా తెలుసు కదా వాళ్లతో చేయించుకో అని అంటున్నాడని ఈ విషయంపై మీ వివరణ కోరగా అలాంటిది ఏమీ ఉండదు నేను చెబుతానని చెప్పి శుక్రవారం సాయంత్రం 6 గంటలు దాటినా కూడా స్పందించకుండా కనీసం కనెక్షన్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా కనిపించలేదు. ఇప్పటికైనా విద్యుత్ జిల్లా ఉన్నతాధికారులైన స్పందించి కంటాయపాలెం గ్రామంలోని కస్నతండ రైతులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ సరఫరా చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టి నిర్లక్ష్యం వహిస్తున్న లైన్మెన్ పై చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నరసింహ, మురళి, దేవేందర్ భాస్కర్, కమల తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆరోగ్యానికి ప్రాధాన్యత

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని కోరారు తొర్రూరు,రాయపర్తి,పెద్దవంగర మండలాలకు చెందిన వివిధ గ్రామాలోని 163 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 56లక్షల 42 వేల 500 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూప్రజారోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని,పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని,పెద్ద మొత్తంలో సీఎం ఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుపేదల అభివృద్ధియే లక్ష్యంగా అనేక సంక్షేమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని తెలిపారు.రాబోయే రోజుల్లో అనేక సంక్షేమాలు పథకాలు చేపట్టబోతున్నమని తెలిపారు.సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని,అప్లికేషన్ గడువును ఆరు నెలల నుండి సంవత్సరానికి పెంచినా ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలిపారు, నియోజకవర్గంలో ప్రజలు ప్రమాదాల బారిన పడితే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలందరికీ సీఎంఆర్ఆఫ్ అప్లికేషన్లపై అవగాహన కల్పించాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి,టిపిసిసి మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య,వైస్ చైర్మన్ జీనుగా సురేందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల అధ్యక్షులు సుంచు సంతోష్,రవీందర్ రెడ్డి,ముద్దసాని సురేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవినాయక్, నాయకులు చాపల బాపురెడ్డి,ధరావత్ సోమన్న, తూనం శ్రావణ్ కుమార్, వెన్నెం సోమిరెడ్డి,గోపి నాయక్, వెలుగు మహేశ్వరి,అనిత, రాములమ్మ, రాణి, నరేష్, రమేష్ నాయక్,లబ్ధిదారులు,తదితరులుపాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ పాఠశాల వసతి గృహాన్ని అకస్మితకంగా తనిఖీ చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి









**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** పాలకుర్తి మండల కేంద్రంలో లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల వసతి గృహాన్ని అకస్మితకంగా తనిఖీ చేసి హాస్టల్లోన్ని తరగతి గదుల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత గురించి సిబ్బందినీ అడిగి తెలుసుకొన్ని , పాఠశాలలోని సదుపాయాల, చెత్త, మరుగుదొడ్ల, నిర్వహణ, సిజనల్ జ్వరాలు, తీసుకో వలసిన జాగ్రత్తల పై గురించి, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్ని, విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నా.పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని సూచించారు, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నానని, విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు, విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులు మా దృష్టికి తీసుకురావాలని, సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ పరిసర పరిశుభ్రత పాటించాలన్నారు, తెలంగాణ ప్రజా ప్రభుత్వం వసతి గృహాలకు అధిక ప్రాధాన్యిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పాఠశాల యాజమాన్యం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నేడు మహబూబ్ నగర్ జిల్లాలో జరగబోయే రైతు పండుగ మహాసభను విజయవంతం చేయాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తి చేసుకునే సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే రైతు పండుగ మహాసభను వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని తొర్రూర్, పెద్దవంగర, నెల్లికుదురు మండలాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో రైతులను రాజులను సంకల్పంతో రైతులు పండించిన ప్రతి గింజలు కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన సన్నకు దాన్ని క్వింటాకు 500 రూపాయల బోనసిస్తున్నామని అన్నారు, గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటకు గిటుబాటు ధర అయ్యాక బోనస్ ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను పదివేల రూపాయల నష్టపరిహారం ఇస్తానని చెప్పి కేసీఆర్ ఇవ్వలేదని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతుకు పెద్దపీడ వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అహర్షణ కృషి చేస్తున్నారని తెలిపారు.

# గోవులకు సేవ చేసుకోవడం సనాతన ధర్మం: క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29:** గోవులకు సేవ చేసుకోవడం సనాతన ధర్మం అని క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ అన్నారు.శుక్రవారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని డివోషనల్ యాక్టివిటీస్ లోభాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ టీచర్స్ ఆధ్వర్యంలో తొర్రూర్ లోని గోశాలలో గల గోవులకు క్లబ్ ప్రతినిధులు పశుగ్రాసం పశువుల దాణ అందించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ మాట్లాడుతూ..హిందులకు పవిత్ర మాసం కార్తీక మాసం సందర్భంగా గోశాలలోని గోవులకు పశువుల దాన అందించడం సంతోషకరంగా ఉందన్నారు.గోవులలో దేవుళ్ళు కొలువై ఉంటారని హిందువులు విశ్వసిస్తారని అన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి వెలిదె సురేష్ కుమార్, డయాబెటిక్ క్యాంపు చైర్మన్ ఆర్ యాకయ్య, క్లబ్ డైరెక్టర్ ఇల్లందుల శ్రీనివాస్, మరియు హంగర్ రిలీఫ్ చైర్మన్ తోట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు గణిత భావాలను అలవర్చుకోవాలి

● మండల విద్యాశాఖ అధికారి జి అనితా దేవి



తొలి అక్షరం/మరిపెడ, 29: గణితం అనేది మన రోజువారీ జీవితంలో చాలా ముఖ్యమైన విషయమని,గణితం ఉపయోగించి మనం చాలా విషయాలను చేయవచ్చని గణిత ఫోరం మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన క్విజ్ కార్యక్రమంలో మరిపెడ మండల విద్యాశాఖ అధికారిని గాదె అనితదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితం ఉపయోగించి మనం ఆర్థిక లెక్కలను ఆదాయాన్ని, ఖర్చులను లెక్కించవచ్చని, శాస్త్రీయ పరిశోధనలను చేయడానికి, డేటాను విశ్లేషించడానికి, గ్రాఫ్‌లను గీయడానికి గణితాన్ని ఉపయోగించవచ్చని, ఇంజనీరింగ్ పనులను చేయడానికి,భవనాలను నిర్మించడానికి గణితం ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా క్విజ్ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. డిసెంబర్ 13న జరిగే జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ అనంతరావు గణిత ఫోరం మండల కార్యదర్శి యాకయ్య, కోశాధికారి పవన్,దత్తప్రసాద్,బాబురావు,ప్రసాద్ రావు, వెంకటయ్య,రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బద్ధకంగా ఉంటే వచ్చేది అనారోగ్యం

● సాధన చేస్తే వచ్చేది ఆరోగ్యం: గోల్డ్ మాన్ సూర్య భాయ్





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 29: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ అధ్వర్యంలో కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు హైదరాబాద్ ఓల్డ్ సిటీ గోల్డ్ మాన్ సూర్య భాయ్ ని కలిశారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ వారిని శాలువా, పూలమాల తో సత్కరించారు. ఈ సందర్భంగా సూర్య భాయ్ మాట్లాడుతూ నిత్యం ఉరుకుల, పరుగుల జీవిత ప్రయాణం లో మానసిక ఒత్తిడి తట్టుకోవడం చాలా కష్టం తో కూడుకున్న పని. దానికి తోడు పెద్దలు, యువత, చిన్న పిల్లలు సెల్ ఫోన్ కు బానిసలై జీవితాన్నినాశనం చేసుకుంటున్నారు. నేడు మహిళలు, యువతులు ఎందరో అరాచక రాక్షసుల చేతిలో బలైపోతున్నారు. దీని నుండి బయట పడాలంటే ఒక్కటే మార్గం అది శారీరకంగా, మానసికంగా దృడంగా ఉండడమే. దానికి చేయవలసిందల్లా రోజు ఒక గంట కుంగ్ ఫు, కరాటే నేర్చుకోవడం. ఒక గంట సమయం కోట్ల విలువైన జీవితం దీనితో శారీరక బలం పొందవచ్చని అన్నారు. కుంగ్ ఫు, కరాటే నిత్యం ప్రాక్టీస్ చేస్తే బాడీ పోస్టర్ మరియు చురుకుదనాన్ని పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కుంగ్ ఫు విద్యార్థులకు తన ఇంట్లో భోజనాలు చేయించి వారితో కలిసి భోజనం చేశారు.

# నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుంది

● వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),నవంబర్29: పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం 10వ డివిజన్ కాపువాడలో రూ. 30లక్షలతో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దశల వారిగా అన్ని వార్డులలో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి సంహరించాలని కోరారు. కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరలో పరిష్కరం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షులు శోభనబోయిన కుమార్ యాదవ్,మాడిశెట్టి సతీష్, హరిసింగ్,రాజు, షేక్ యాకుబ్, నసీర్, అజార్, మోహిని అలీ, గంద్రాతి సారయ్య,రాజు,అడప యాదగిరి, లవ కుమార్, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.



# కోటి దీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

● కార్తీక మాసంలో ఒక్క దీపం వెలిగించిన పాపం తొలగిపోతుంది

● షాద్ నగర్ పట్టణంలో ఘనంగా కార్తీక మాస కోటి దీపోత్సవ కార్యక్రమం





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 29: షాద్ నగర్ చరిత్రలోనే అద్భుతమైన కోటి దీపోత్సవ కార్యక్రమం జరిగిందంటూ, అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో కోటి దీపోత్సవ కార్యక్రమంలో నేను పాల్గొనడం, కార్తీక మాసం శుభ సందర్భంగా శివాభిషేకం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అంటూ, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన హాజిపల్లి నివాస్ శ్రీనివాస్ దంపతులకుఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. షాద్నగర్ పట్టణంలోని ఆకుల మానయ్య గ్రౌండ్లో హాజిపల్లి గ్రామానికి చెందిన నివాస్ శ్రీనివాస్ దంపతులు కార్తీక మాస కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కోటి దీపోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి పాల్గొని మొదటగా ఆదిదేవతలు కొలువైన గోమాతకు పూజ కావించి, అనంతరము జరిగిన శివ రుద్రాభిషేకంలో కాశీ నుండి తెచ్చిన శివలింగానికి రుద్రాభిషేకము నిర్వహించి, పాలమూరు వాస్తవ్యుడైన గౌరవయ్య స్వామి అనుగ్రహ భాషణం విని, కోటి దీపోత్సవ కార్యక్రమంలో మొదటగా జ్యోతి ప్రజ్వలన గావించి మొత్తం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తిలకించారు. పూర్తి భక్తి పరవశంతో సాగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మొదటి నుండి చివరి వరకు పూర్తి భక్తి పారవశ్యంలో చలిని సైతం పక్కకు నెట్టి ఆ భగవంతునిపై తనకున్న భక్తి ప్రపత్తులు చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తో పాటు పట్టణ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మామిడిపల్లి ఎంపిటిసి కట్న మాదవి రవిందర్, ఈదులపల్లి మాజీ సర్పంచ్ పట్వారి శ్రవణ్, పుర ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహబూబ్ నగర్ జిల్లాలో జరగబోయే రైతు పండుగ మహాసభను విజయవంతం చేయాలి

● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 29: మహబూబాబాద్ జిల్లా: తొర్రూరు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, సంవత్సరకాలం పూర్తి చేసుకునే సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే రైతు పండుగ మహాసభను వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర, నెల్లికుదురు మండలాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో రైతులను రాజులను సంకల్పంతో రైతులు పండించిన ప్రతి గింజలు కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన సన్నకు దాన్ని క్వింటాకు 500 రూపాయల బోనసిస్తున్నామని అన్నారు, గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటకు గిటుబాటు ధర అయ్యాక బోనస్ ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను పదివేల రూపాయల నష్టపరిహారం ఇస్తానని చెప్పి కేసీఆర్ ఇవ్వలేదని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతుకు పెద్దపీడ వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశ కృషి చేస్తున్నారని తెలిపారు..

# చిరునవ్వుతో పలకరించే మంచి మనస్తత్వం కలిగిన వ్యక్తి

● మచ్చలేని నాయకుడు మచ్చ సురేష్

● రెండోసారి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు అధ్యక్షులుగా మచ్చ సురేష్

● ఛాంబర్ ఆఫ్ కామర్స్ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సురేష్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), నవంబర్29:తొర్రూర్ డివిజన్ కేంద్రంలోనీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చరిత్రలోనే 275 ఓట్ల అత్యధిక మెజారిటీతో రెండోసారి అధ్యక్షుడిగా గెలుపొందిన మచ్చ సురేష్. క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా ఆదర్శవంతమైన ప్రజానాయకుడిగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు అధ్యక్షులుగా మచ్చ సురేష్ అందరి అభిమానాన్ని పొందుతున్నారు. తన పదవీ కాలంలో చాంబర్ ను అభివృద్ధి చేసి జిల్లాల్లోనే ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దారు మచ్చ సురేష్. 2022వ సంవత్సరం జనవరిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు అధ్యక్షులుగా ఎన్నికల బరిలో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న మచ్చ సురేష్ తన గెలుపును ఛాంబర్ అభివృద్ధి వైపు మలుపు తిప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన చాంబర్ ఆఫ్ కామర్స్ కు తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న వర్తక,వాణిజ్య వ్యాపారస్తులనమ్మకాన్ని విశ్వాసాన్ని వృదచేయకుండా తన పనితనంతో ముందుకు దుసుకెళ్తున్నారు. పట్టణంలో ఉండే వ్యాపారస్తులు అంతా ఒకరికి ఒకరు స్నేహ భావంతో మెలిగేవారేనని అలాంటి స్నేహితులతో ప్రయాణం చేయడానికి తనకు చాంబర్ ఆఫ్ కామర్స్ వేదికవడం అదృష్టంగా భావిస్తున్నానని సురేష్ అంటున్నారు. రెండోసారి చాంబర్ ఆఫ్ కామర్స్ కు అధ్యక్ష బాధ్యత చేపట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని వర్తకులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని మచ్చ సురేష్ స్పష్టం చేశారు.

# నిద్రిస్తున్న వ్యక్తిపై నుండి వెళ్లిన వరి కోత యంత్రం

- తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే వ్యక్తి మృతి



తొలి అక్షరం/మరిపెడ, నవంబర్ 29: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది .గ్రామస్తుల కథనం ప్రకారం తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా కొమ్మ కోణం గ్రామానికి చెందిన సత్తిరాజు అనే డ్రైవర్ హార్వెస్టర్ కింద నిద్రిస్తుండగా అది గమనించని మరో డ్రైవర్ ఏమరపాటున నడపడంతో సత్తిరాజు తలపై నుండి హార్వెస్టర్ వెళ్లగా అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సంఘటన జరిగిన స్థలానికి వెంటనే పోలీసులు చేరుకొని పంచనామ నిర్వహించి మృత దేహాన్ని మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

# గడ్డం రాములుకు నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు



తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 29: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన గడ్డం రాములు అనారోగ్య కారణాలతో మృతిచెందగా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రావులహరిశ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,పట్టణ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈదునూరి సాయికృష్ణ,నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, ఆంజనేయ స్వామి చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు, మూసిన శ్రీనివాస్,మహమ్మద్ అన్వర్, ఈదునూరి దిలీప్, కొత్తకొండ గణేష్, కక్కెర్ల నాగయ్య,వనం ఏకాంతం,తాళ్లపల్లి భాస్కర్, గడ్డం వెంకన్న తదితరులు మృతదేహాన్ని సందర్శించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకి ఎంపికైన నెక్కొండ మోడల్ స్కూల్ విద్యార్థి



తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 29:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని వరంగల్ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన నర్సంపేట మండలంలోని శివాని హైస్కూల్లో నవంబర్ 26 నుండి 28 జరుగుతున్న నేపథ్యంలో నెక్కొండ మండలంలో గల మోడల్ స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్నటువంటి రాచకొండ సాయి రిత్విక్,హర్షవర్ధన్ విద్యార్థులు ఇన్స్పైర్ ధరానక్ లో భాగంగా రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపీక కావడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని మరియు గైడ్ టీచర్ అయినటువంటి అజ్మీర రమేష్ పి జి టి ఫిజిక్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయినా ప్రణవ్ కుమార్ లు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# ఎమ్మెల్యే సార్... మా గ్రంధాలయం పట్టించుకోరా?

**● నూతన గ్రంథాలయం ప్రారంభించారు మళ్లీ తాళం వేశారు ● ప్రజాప్రతినిధులు.పాఠకులు, విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని అధికారులు? ● మీరైనా పట్టించుకోవాలి అంటూ ఎమ్మెల్యే మండల ప్రజలు కోరారు**






**తొలి అక్షరం/నర్సింహులపేట. నవంబర్ 29:** గ్రంథాలయాలు విజ్ఞానానికి . ప్రతీకలు ఎంతోమంది మేధావులు విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని సంపాదించిన వాళ్ళే ప్రతి చదువుకున్నవారు తమ సామయనుకులంగా గ్రంథాలయాలకి వెళ్లి విజ్ఞానం పెంపొందించుకోవాలని అనుకుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ లైబ్రెరీ లా పై ప్రసంగాలు చేస్తూనే ఉంటారు. కానీ గ్రంథాలయాలు మూతపడుతుంటే మాత్రం అధికారులు ప్రజాప్రతినిధులు వాటిని తెరిపించేందుకు ఏమాత్రం ప్రయత్నాలు చేయడంలేదు. మహబూబాబాద్.జిల్లాలోని నర్సింహులపేట లో మండలంకేంద్రములో ఉన్న శాఖాగ్రంథాలయం గత ఐదు సంవత్సరాలుగా తలుపులు తెరచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ముత పడి వుంది..సిబ్బంది కొరత, చూపుతూ సమస్యను దాట వేస్తున్నారు. గ్రంథాలయాయనికి తాళం పడుతున్న పాఠకుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. తాత్కాలిక సిబ్బందిని నియమించి గ్రంథాలయాలను పునఃప్రారంభించే అవకాశాలు ఉన్నప్పటికీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. మండల కేంద్రంలో గ్రంథాలయం సుమారు 5 సంవత్సరాలు మూతపడిన పట్టించుకోలేదు.ఇటీవల నెల రోజుల క్రితం ఆర్భాటంగా నూతన లైబ్రెరీ ప్రారంభించి కేవలం 10రోజులు తీసి మళ్ళీ మూసివేశారు. ప్రస్తుతం గ్రంథాలయం మూతపడిన పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. లైబ్రెరీ నూతనంగా వచ్చిందనే సంతోషాన్ని కూడా మిగల్చకుండా పాఠకులకు మూడురోజుల మురిపెం చేశారు ఇటీవలమండల కేంద్రంలో గ్రంథాలయం వెళ్లనుకునే పాఠకులకు నిరాశే మిగులుతుంది ఎప్పడూ వెళ్లిన తాళం వుండటం తోవందల మంది విద్యార్థులు, పాఠకులకు గ్రంథాలయాలు దిన, వార, మాసపత్రికల తోపాటు నవలలు పాఠకులు, ఇతర విజ్ఞాన పుస్తకాలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా దుస్థితిని ప్రభుత్వం, గ్రంథాలయ సంస్థ నిర్లక్ష్యం కారణంగా కొత్త సిబ్బంది నియామకం చేపట్టకపోతు ఒడడంతో ఇక గ్రంథాలయాలపై ఆశలు వదులుకోవలసిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి పాఠకులసమస్యలు వినాలని రెగ్యులర్ సిబ్బందినో, కాంట్రాక్టు సిబ్బందినో నియమించి మూతపడిన గ్రంథాలయాలను తెరిచే బాధ్యత ఎంతైనా ఉందనీ డోర్నకల్ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ను మండల ప్రజలు కోరుతున్నారు నర్సింహులపేటమండల కేంద్రంలో గ్రంథాలయం మళ్లీ ప్రారంభించాలని పలు సంఘాల నాయకులు విద్యార్థులు మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..

# పచ్చని వనాలపై గొడ్డలి వేటు

# అక్రమంగా తరలిపోతున్న వృక్ష సంపద

**● భారీ వృక్షాలను నరికివేసి యదేచ్ఛగా లారీలో తరలింపు ● విలువైన వృక్ష సంపదను నరికి వేస్తున్న కొందరు ప్లాట్ల యజమానులు ● రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికి వేయడానికి వీరికి ఎవరూ అనుమతిచ్చారు**





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 29:** వృక్షో రక్షితి రక్షితః చెట్లను మనం రక్షిస్తే ఆ చెట్లే మనని కాపాడతాయి జీవరాశులతో పాటు మానవ మనుగడకు పచ్చని చెట్లే ప్రధాన కారణం అలాంటి జీవసంపదను కంటి రెప్పలా కాపాడుకోవాల్సిన కాలనీవాసులు కొందరు నిర్లక్ష్యంగా భారీ వృక్షాలను గొడ్డలి వేటుకు గురిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంటే మరోపక్క కొందరు చెట్లను నరికి వేస్తూ కలపని అక్రమంగా తరలిస్తున్నారు. అటవీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పచ్చని కలుపకు కాల్లోస్తున్నాయి.తాజాగా షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని కీర్తి వెంచర్ లో రోడ్లకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను నరికివేసి యదేచ్ఛగా లారీలో తరలిస్తున్నారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కీర్తి వెంచర్ లో అప్పటి వెంచర్ యాజమాన్యం విలువైన వృక్ష సంపదను నాటి భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో పెంచి భారీ వృక్షాలను గా తయారు చేశారు. కానీ ఈ మధ్య ప్లాట్ లను కొనుగోలు చేసిన కొందరు యజమానులు ఆయా ప్లాట్లలో వెలిసిన పిచ్చి మొక్కలతో పాటు రోడ్ల కి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను సైతం నరికివేసి పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనానికి వేల కోట్లు ఖర్చు చేస్తుంటే కొందరు మాత్రం వీటిని నేలమట్టం చేసి యదేచ్ఛగా అమ్మేస్తున్నారు. రోడ్ల కిరువైపులా ఉన్న చెట్లను నరికి వేయడానికి అసలు వీరికి ఎవరు అనుమతిచ్చారు. ఇరవైసంవత్సరాల క్రితం నాటిన మొక్కలు నేడు భారీ వృక్షాలుగా రూపాంతరం చెందాయి. వీటిని నరకాలంటే అటవీ అధికారుల అనుమతి పొందాలన్న కనీస ఆలోచన కూడా వీరికి రాలేదు ఇప్పటికే పర్యావరణ సమతుల్యం దెబ్బతిని షాద్ నగర్ ప్రాంతం కాలుష్య కారకంగా తయారైంది కాస్తో కూస్తో అక్కడక్కడ భారీ వృక్షాలు ఉన్నాయనుకుంటే వాటిని కూడా నాశనం చేస్తున్నారు. భారీ వృక్షాలను నరికి వేస్తున్నారన్న సమాచారం అందుకున్న అటవీ అధికారులు కలపతో ఉన్న లారీని సీజ్ చేసి స్టేషన్ కు తీసుకెళ్లారు. చెట్ల నరికివేత పై అటవీ అధికారీ రవీందర్ ను "ఆదాబ్ హైదరాబాద్" వివరణ కోరగా మా వద్ద ఎవరు ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఇలాంటి చెట్ల నరికివేతకు ఇవ్వరు పాల్పడిన వాల్టా చట్టం కింద కేసు నమోదు చేస్తామని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించేందుకు అటవీ శాఖ అనుమతులు పొందాలి. మా దగ్గర ఎవరైనా అనుమతి పొందాలన్నా పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లదని ముందుగా ధ్రువీకరించాలి వాల్టా నిబంధనలు అమలుచేయాలి. నరికి వేసిన వృక్షాలకు బదులుగా, వేరే ప్రాంతంతో రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని హామీ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.



## నెక్కొండ పట్టణ వాస్తవ్యుల షాది ముబారక్‌కు హాజరైన మండల నాయకులు



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 29:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ రఫీ (జిరాక్స్ సెంటర్) బావమరిది మహ్మద్ అంజద్ ఖాన్- అలీమ ల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన నెక్కొండ మాజీ పిఎసిఎస్ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి. పదాల శేఖర్ రెడ్డి, దుగ్గి వెంకట్ రెడ్డి, బొడ్డుపెల్లి రాజు, ఈదునూరి శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.


## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**తొలి అక్షరం/పాపన్నపేట నవంబర్ 29:** పాముకాటుతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...పాపన్నపేట గ్రామానికి చెందిన పెద్ద కటికే నబీసాబ్ (36) వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.23న జీవాలను మేపడానికి వెళ్లగా గ్రామ శివారులో పాము కరిచింది.దీంతో వెంటనే ఇంట్లో వారికి చెప్పడంతో వారు చికిత్స కోసం మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం గురువారం సాయంత్రం గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి అన్న షాదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## గేట్ వాల్ మూత తీయడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

**● మండల కేంద్రంలో అధికారులు ఉన్నారా లేదా ● ఇంత నిర్లక్ష్యము ● ఒక సంవత్సరం అయినా గేట్ వాల్వు మూయలేదు**





**తొలి అక్షరం/నరసింహుల పేట:** నరసింహుల పేట మండల కేంద్రంలో హై స్కూల్ ఎదురుగా గత సంవత్సరం నుండి గేట్ వాల్ మూత వేయడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు ఈ గేట్ వాల్ మూత వేయకపోవడంతో వల్ల చెత్తాచెదారం చేరుకొని కలుషిత నీళ్లు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు దీనివల్ల కొంతమంది వాహనదారులు అందులో పడి కాళ్లు చేతులు విరిగిన సందర్భం లు ఉన్నాయి కావున అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే గేట్ వాల్వు మూత వెయ్యాలని మండల ప్రజలు పంచాయతీ కార్యదర్శి స్పందించాలనికోరారులేనియెడల కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తామని మండల ప్రజల డిమాండ్ చేశారు.

# పది పరీక్షల్లో గ్రేడింగ్ విధానానికి స్వస్తి

**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 29:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పరిధిలో ఈ ఏడాది నుంచి 100 మార్కులకు రాత పరీక్షలురాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంఉన్నపళంగా మార్పులు చేయడంపై విమర్శలు.పది పరీక్షల్లో గ్రేడింగ్ విధానానికి స్వస్తిపదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఈ ఏడాది నుంచి గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలుకుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు అంతర్గత పరీక్షలకు 20 మార్కులు.. వార్షిక పరీక్షలకు 80 మార్కులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం(2024-25) నుంచే అంతర్గత పరీక్షలకు మార్కులను కేటాయించే విధానాన్ని ఎత్తివేశారు. ఇక ఇంటర్మీడియట్ తరహాలోనే మార్కులు ఇవ్వనున్నారు. విద్యార్థులు మార్కులకు సంబంధించి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, పదో తరగతిలో మార్కులకు బదులు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఒకానొక దశలో ఇంటర్‌లోనూ ఈ విధానాన్ని తేవాలని భావించారు. కాగా తాజాగా గ్రేడింగ్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి ఆరు సబ్జెక్టుల పరీక్షలకు 600 మార్కులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే పాఠశాల విద్యాశాఖకూ ఆదేశాలిచ్చింది. వచ్చే మార్చిలో జరిగే వార్షిక పరీక్షల నుంచే తాజా మార్పులు అమలులోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.50 లక్షల మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన ఆర్నెల్ల తర్వాత.. వార్షిక పరీక్షలకు మూడున్నర నెలల ముందు పరీక్షల విధానం మార్చడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.విద్యాహక్కు చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం(సీసీఈ) అమలవుతోంది. రాష్ట్రంలో దాన్ని 2011 నుంచి అమలు చేస్తున్నారు. ఆ ప్రకారం అంతర్గత పరీక్షలకు(ప్రాజెక్టులు, రాతపనికి) 20 మార్కులు, వార్షిక పరీక్షలకు 80 మార్కులు ఇస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 20కి 20 మార్కులు వేస్తుండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు అంతర్గత పరీక్షలకు మార్కులుండవు. ఒక్కో సబ్జెక్టు పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. సైన్స్‌లో భౌతిక, జీవశాస్త్రాలున్నందున ఒక్కో దానికి 50 మార్కుల చొప్పున కేటాయిస్తారు.**ఇప్పుడా పరీక్షల విధానం మార్చేది?** ఇలాంటి నిర్ణయాలను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రకటిస్తే విద్యార్థులు మానసికంగా సిద్ధమవుతారని, కేవలం పరీక్షలకు 4 నెలల ముందు వెల్లడించడంపై విద్యారంగ నిపుణులు, కొందరు హెచ్ఎంలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ నుంచి ఆగస్టు 19న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. మూడు నెలల 10 రోజులకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇప్పటికే 80 మార్కులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ-1) పరీక్షలు పూర్తయ్యాయి. 'దాదాపు సిలబస్ పూర్తయింది. ఒక్కో సబ్జెక్టుకు 4 ప్రాజెక్టుల చొప్పున మొత్తం 7 సబ్జెక్టులకు 28 ప్రాజెక్టులు పూర్తిచేయించాం. వాటికి ఎంతో సమయాన్ని కేటాయించారు. ఇప్పుడు కీలక మార్పులు చేయడం మంచిది కాదు.. ఉత్తీర్ణతపైనా ప్రభావం పడుతుంది' అని రంగారెడ్డి జిల్లాకు చెందిన హెచ్,ఎం ఒకరు తెలిపారు. సీబీఎస్ఈ ఎలాంటి మార్పులు చేసినా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రకటిస్తుంది. అందుకు భిన్నంగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పది పరీక్షల్లో ప్రశ్నపత్రం, సెక్షన్లు, ఏ ప్రశ్నకు ఎన్ని మార్కులో విద్యార్థులకు తెలుసు. పరీక్షల విధానం మార్చిన విద్యాశాఖ ప్రశ్నపత్రం స్వరూపాన్ని మాత్రం విడుదల చేయకపోవడం గమనార్హం.**ప్రభావం ఇలా..** ఇప్పటివరకు గ్రేడింగ్ విధానం ఉండటంతో పరీక్షల ఫలితాల వెల్లడి తర్వాత కొన్ని వేల మంది మాత్రమే పునర్మూల్యాంకనం, పునఃలెక్కింపునకు దరఖాస్తు చేస్తున్నారు. కనీసం 9 మార్కులు కలిస్తే తప్ప గ్రేడ్ మారదని భావించి విద్యార్థులు పునర్మూల్యాంకనానికి ఆసక్తి చూపడం లేదు. ఉదాహరణకు సైన్స్‌లో 80-89 మార్కులకు ఏ2 గ్రేడ్ ఇస్తారు. ఒక విద్యార్థికి 80 మార్కులు వస్తే అది ఏ1గా గ్రేడ్(90-100 మార్కులు) మారాలంటే కనీసం 90 మార్కులు తెచ్చుకోవాలి. ఇప్పటివరకు బాసర ఆర్‌జీయూకేటీలో పదో తరగతి గ్రేడ్ల ఆధారంగా ఇంటిగ్రేటెడ్ బీటెక్(రెండేళ్లు ఇంటర్, నాలుగేళ్లు బీటెక్) సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి 0.4 శాతం అదనంగా కలిపి సీట్లు ఇస్తారు. ఉదాహరణకు ప్రైవేట్ పాఠశాల చదివిన విద్యార్థికి 10 జీపీఏ వచ్చింది అనుకుందాం.. ప్రభుత్వ పాఠశాలలో 9.6 గ్రేడ్ తెచ్చుకున్నా దానికి 0.4 కలిపి 10 జీపీఏగా లెక్కిస్తారు. ఇప్పుడు గ్రేడింగ్ విధానాన్ని తీసివేస్తున్నందున ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎన్ని మార్కులు అదనంగా కలుపుతారో నిర్ణయించాల్సి ఉంటుంది. 6-9 తరగతుల్లో అంతర్గత మార్కు(20)ల విధానం అమలవుతోంది. ఇక 1-5 తరగతులకు కూడా 50 మార్కులకు అంతర్గత పరీక్షలు, 50 మార్కులకు చివరి పరీక్షలు ఉంటాయి. ఆ తరగతులపై విద్యాశాఖ ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు.



# దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి సైన్స్ ఫెయిర్ ఎంతో ముఖ్యం: ఎమ్మెల్సీ రగోత్తం రెడ్డి

- మెదక్ వెస్లీ కళాశాల ఘనంగా ప్రారంభమైన ఇన్స్పైర్
- పెద్ద సంఖ్యలో వచ్చిన ఎగ్జిబిట్లు



**తొలి అక్షరం/మెదక్, నవంబర్ 29:** భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలంటే విద్యార్థులకు చిన్నప్పటినుండే ఇన్స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన ల అవసరం ఎంతగానో ఉందని ఎమ్మెల్సీ కూర రఘుతంరెడ్డి వెల్లడించారు. మెదక్ పట్టణంలోని వెస్లీ కళాశాల ఆవరణలో శుక్రవారం మెదక్ జిల్లా స్థాయి ఇన్స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైంది, రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభ ను బయటకు తీయడానికి ఈ ఇన్స్పైర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా సైన్స్ మానవ మనవడ అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించాలె తప్ప ప్రపంచ వినాశనానికి ఉపయోగించవద్దని ఆయన సూచించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఎంతగానో చెందుతున్న నేటి కాలంలో విద్యార్థులు టీవీలు సెల్ఫోన్లకు దూరంగా ఉండడం ఎంతగానో మంచిదన్నారు. వాటి ద్వారా కేవలం మంచిని మాత్రమే గ్రహించాలని, చెడుకు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ నగరంలో కాలుష్యం ఎంతగానో పెరిగిపోయిందని, ఇటీవల హైదరాబాద్ లో సైతం కాలుష్యం పెరుగుతుందని వాటి నివారణకు శాస్త్రవేత్తలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధి పేదలకు అందాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ మాట్లాడుతూ సైన్స్ అనేది అపారమైనదని పేర్కొన్నారు. న్యూటన్ అనే శాస్త్రవేత్త విజ్ఞాన శాస్త్రం అనేది మహా సముద్రం అని పేర్కొన్నారని దాన్ని జీవిత కాలంలో చేరుకోలేకపోయానని అన్నాడని డీఈఓ వెల్లడించారు. ప్రతి ఏటా నిర్వహించే ఇన్స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ కరోనా మూలంగా గత మూడు సంవత్సరాలుగా ఆన్లైన్లో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ ఏటా భౌతికంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించడానికి వివిధ సంఘాలతో పాటు చాలామంది ఉపాధ్యాయులు మూడు రోజులుగా విధులు నిర్వహిస్తున్నారని ,ఈ సందర్భంగా వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు, అయితే సైన్స్ ఫెయిర్ నిర్మాణంలో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతాయని వాటిని భూతద్దంలో చూడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో జిజ్ఞాస పెంపొందించడానికి ఇన్స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల నైపుణ్యం బయటకు తీసే సత్తా కేవలం ఉపాధ్యాయులకే ఉంటుందని ఆమె అన్నారు. ముఖ్యంగా బాల బాలికలు చిన్న గా ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఏదైనా వస్తువు ఇస్తే అందులో ఏముంది ఏమిటి ఎలా అని తెలుసుకోవాలని తహతలాడతారని పేర్కొన్నారు. ఏదైనా వస్తువు ఇచ్చినప్పుడు దాన్ని విరగగొడుతుంటారని అంటే అందులో ఏముందని తెలుసుకోవడమే వారి ఉద్దేశం అన్నారు. అలాంటి వారిలో ఎక్కువమంది శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ఆమె తెలిపారు. 392 ఎగ్జిబిట్లు మెదక్ వెస్లీ కళాశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ఫేర్ కు 392 ఎగ్జిబిట్లు వచ్చాయి. రవాణా మరియు కమ్యూనికేషన్ కు సంబంధించి 70, విపత్తు నిర్వహణకు 43, వనరుల నిర్వహణ 58, సహజ వ్యవసాయం 42, వ్యర్థాల నిర్వహణ 45, ఆహార ఆరోగ్య పరిశుభ్రత 53 గణిత నమూనాల గణనా ఆలోచన 48 చొప్పున వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్ మండల విద్యాధికారి నీలకంఠం ,టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన వేడుకలు





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్29:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యములో ప్రశాంత్ నగర్ లోని తేజస్వి పాఠశాలలో జరుగతున్న జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన - 2024 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు,శాసన మండలి సభ్యులు అలుగువెల్లి నర్సిరెడ్డి,జిల్లా కలెక్టర్ ప్రవీణ్య, డిఈఓ వాసంతి.విద్యార్థుల అపూర్వ స్వాగతల మధ్య కార్యక్రమం ప్రారంభించుకుని సర్ సివి రామన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళీలు అర్పించిన ఎమ్మెల్యే.అనంతరం జ్యోతి ప్రజ్వలనా చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ...విద్యార్థుల్లో చదువుతో పాటు వైజ్ఞానిక పరమైన జ్ఞానాన్ని రూపొందించుకోవడానికి ఒక వేదికగా నిలుస్తుంది.ఈ వేదిక ద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఏకమవుతు వైజ్ఞానికి ప్రదర్శన చేపట్టడం చాలా శుభ పరిణామం.రానున్న రోజుల్లో హంటర్ రోడ్డు లోని సైన్స్ ఫెయిర్ సెంటర్ 10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాము.రాష్ట్ర వైద్యా శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ చేతుల మీదుగా పునఃప్రారంభం కానున్నది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖలో సమూలన మార్పులను తీసుకువస్తున్నారాని రానున్న రోజుల్లో నాణ్యమైన ప్రమాణాలతో కుడినా విద్యను అందిస్తామని తెలిపారు.విద్యార్థుల మేదస్సు మరింత పెపొందించుకోవాలి అభిలాషించారు.ఎందరో మహనీయుల స్ఫూర్తిదయాకమైన బాటలో ఈ తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని దీవించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు ఎందుకు..?

- భోజనం విషయంలో నిర్వాహకుల పాత్ర కీలకమే
- నాణ్యమైన బియ్యం సరఫరా అందించాల్సిందే
- నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాల్సిందే
- అమ్మ ఆదర్శ కమిటీలు బాధ్యత తీసుకోవాల్సిందే





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్29:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరుపై అడపాదడపా అనేక సమస్యలు ఎదురవుతుండడం సోచనీయం ఇటీవల రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం కల్తీ ఆహారము అయినందువలనే తీవ్ర అస్వస్థకు గురయ్యారనే ప్రచారం జరిగినప్పటికీ కారణాలు ఏమైన ఏమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన మధ్యాహ్న భోజన వసతి సౌకర్యాలను కూడా కల్పించి విద్యార్థులకు పరిశుభ్రమైన శుద్ధమైన ఆహారాన్ని అందించవలసిన బాధ్యత సమన్వయంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాటు స్థానికంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు రాజకీయాల కతీతంగా అన్ని వర్గాలవారు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సరైన పరిశుభ్రమైన భోజనాన్ని అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా చర్యలు చేపట్టవలసి ఉన్నది తరచుగా మధ్యాహ్న భోజన పథకం పై పర్యవేక్షణ అధికారులు పర్యవేక్షిస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్నటువంటి మధ్యాహ్న భోజన నిర్వాహకులకే బాధ్యతాయుతమైన ఆహారాన్ని అందించే విధంగా ప్రయత్నం చేయవలసి ఉంటుంది ఇందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు అధికారులకు కూడా మధ్యాహ్న భోజన పథకంలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.మధ్యాహ్న భోజన పథకంలో తలెత్తే సమస్యలు భోజన నిర్వాహకుల్లో నిర్లక్ష్య వైఖరి అయినా కావచ్చు లేకుంటే ప్రభుత్వం పంపిస్తున్న బియ్యం విషయంలో ఏవైనా తేడాలు గోచరించినప్పుడే ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విషయమై ఇబ్బందికరమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయన్న విభిన్న వాదనలు వినవస్తున్నాయి**పథకంలో ఎదురవుతున్న సవాలక్ష సమస్యలు:** ప్రభుత్వం నుండి పాఠశాలకు పంపేటువంటి బియ్యము నాణ్యత కలిగినటువంటి వైతే పాఠశాలలో నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని వినియోగించకపోతే జరగబోయే అనర్థాలు అధికమే నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణాన్ని ఎంచుకున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో వస్తున్నటువంటి బియ్యం లో అనేక పురుగులు ఉన్న సందర్భాల్లో వాటిని చూడకుండా వండిన క్రమంలో మధ్యాహ్న భోజన పథకమే చాలా తలనొప్పిగా మారుతున్న సందర్భాల్లో ఎవరు ఎవరిని పూర్తిస్థాయిలో ఏకపక్షంగా ప్రశ్నించలేని పరిస్థితులు గోచరించడం గమనార్హం **వసతులతో కూడిన భోజనశాలలు అవసరమే:** ప్రభుత్వం సదుద్దేశంతో జాతీయ సమగ్ర పౌష్టికాహార పథకం కింద విద్యార్థుల మానసిక శారీరక పెరుగుదల ఆరోగ్య అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం సూచించిన రోజువారి వంటకాలతో సక్రమంగా పాఠశాలలో అమలు చేసే విధంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించినటువంటి భోజనశాలలు కూడా నిర్మితమై ఉంటే బాగుండేదని అనుకుంటున్నారు ప్రస్తుతం చాలా పాఠశాలలో ప్రత్యేకంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటశాలకు మాత్రమే పరిమితమైనప్పటికీ వసతులతో కూడినటువంటి మధ్యాహ్న భోజన గదులు లేకపోవడం గ్యాస్ పోయిలు చాలా వరకు పాఠశాలలో లేకపోవడం గ్యాస్ పొయ్యిలు ఉంటే సిలిండర్ ల కొరతను అధిగమించలేకపోవడం క్షేత్రస్థాయిలో జరుగుతున్నది ఈ క్రమంలో అడపాదడపా చాలావరకు ప్రభుత్వ యజమాన్యాల కింద పనిచేసే పాఠశాలల్లో కట్టెలతోనే బయట వండడం వల్ల చెత్తాచెదారం పడే అవకాశాలు లేకపోలేదని వంట ఆవరణ అపరిశుభ్రం అయ్యే అవకాశం లేక పోలేదని అలాంటి ఆహారాన్ని సేకరించిన విద్యార్థులకు అస్వస్థత కోకోలుగా ఉండే అవకాశం లేకపోలేదని అనుకుంటున్నారు విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు పరిశుభ్రమైన తాజా కూరగాయలు వనరులతో అన్ని వసతులతో కలిగిన భోజనశాల కూడా నిర్మితమై ఉండి అందుకు కావాల్సి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ప్రభుత్వం కల్పించినట్లయితే నాణ్యమైన చదువు అందించే ప్రభుత్వ పాఠశాల యొక్క స్థాయి కూడా పెరుగుతుందని ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపుకు ఆకర్షించుకునే విధంగా ప్రభావితం చేసే విధంగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్యార్థులను నమోదు తో పురోగమించగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నవారు లేకపోలేదు **పథకంపై నిరంతర పర్యవేక్షణ ఉండాల్సిందే:** కేవలం అధికారుల పర్యవేక్షణ కాకుండా స్థానికంగా ఉన్నటువంటి స్వయంసేవక సంఘాలు అమ్మ ఆదర్శ కమిటీలు మధ్యాహ్న భోజన పథకం పై ప్రత్యేక దృష్టి సాధించాల్సింది స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తమ విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో సంబంధిత గ్రామ ముఖ్యులు ప్రముఖులు యువజన సంఘాలు,రాజకీయాలకతీతంగా కచ్చితంగా ప్రతి ఒక్కరు కూడా విద్యార్థుల యొక్క శ్రేయస్సు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్న భోజన పథకానికి కావలసినటువంటి ప్రత్యేకమైన అవసరాలు తీర్చడమే కాకుండా వంటలు వండే ఆవరణలో పరిశుభ్రత మంచినీటి సౌకర్యం తో పాటుగా పరిశుభ్రమైనటువంటి మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసి అందించే విధంగా నిర్వాహకు ఎప్పటికప్పుడు తగు సలహాలు సూచనలు ఇస్తూ ఆరోగ్యకరమైనటువంటి తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనాన్ని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అమలు అయ్యేవిధంగా ప్రభుత్వం ఇటు మధ్యాహ్న భోజన పథక పర్యవేక్షణ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తే తప్ప మధ్యాహ్న భోజన పథకం అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తుందనే భావనను వ్యక్తం చేస్తున్న వారు లేకపోలేదు. **పథకంలో లోపాలు ఉంటే సవరించాల్సిందే:** రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం సందర్భంగా ప్రభుత్వ కొన్ని ప్రభుత్వ పాఠశాలలో వెలుగు చూస్తున్న లోపాలను సవరించే క్రమంలో మధ్యాహ్న భోజన పథక అమల్లో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మీదే మొత్తం బాధ్యతను వేయకుండా మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు ఆపై అధికారులు కూడా భోజనాన్ని నాణ్యమైన విలువలతో కూడినటువంటి పథకంగా అమలయ్యేటట్టు చూస్తే రాబోవు కాలంలో ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యతోపాటు విద్యార్థుల మానసిక శారీరక అభివృద్ధికి తోడ్పాటు అందించే మధ్యాహ్న భోజన ఆవశ్యకతతో ప్రభుత్వ పాఠశాలలో కొనసాగించవచ్చునని ఆశాభావాన్ని వ్యక్తపరిచే వారు లేకపోలేదు ఏదేమైనా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణకు అయ్యేటువంటి ఖర్చులను పెంచడమే కాకుండా నిర్వాహకులకు ఎప్పటికప్పుడు మౌలిక వసతులతో పాటు నిర్వహణ ఖర్చులు అందజేస్తే తప్ప సంతృప్తికరమైనటువంటి ఆహారాన్ని నిర్వాహకులు అందించగలరేమో క్రమేణ విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందగలదేమో. (దాడిశెట్టి)

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవు

- విస్తృతంగా వాహన తనిఖీలు
- ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్29:** లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి హెచ్చరించారు. ఉప్పల్ బస్టాప్ ఆవరణలో వద్ద శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు,డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించడం తో పాటు ఎలాంటి అనుమతి లేని, నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి, పత్రాలు లేని వాహనాలను విచారణ నిమిత్తం పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యమంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## వడ్డేపల్లి ప్రజల చిరకాల వాంఛ ఆవిష్కృతమైన తరుణం

- చివరి మజిలీ దేదివ్యమానం చేసిన ఎమ్మెల్యే నాయిని
- హర్షం వ్యక్తం చేసిన వడ్డేపల్లి అన్ని వర్గాల ప్రజలు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్29:** ప్రజల సహకారంతో ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత ప్రజా సమస్యల నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం వడ్డేపల్లిలో రూ 1.20కోట్లతో నిర్మించిన స్మశాన వాటికను ఈ రోజు ప్రారంభించారు. చాలా ఏళ్లుగా స్థానిక ప్రజలు అవస్తలు పడుతున్న తరుణంలో ప్రజల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి నిర్ణత సమయంలో పూర్తి చేసిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.వడ్డేపల్లి ప్రజల ఏ సమస్యనైనా నా దృష్టికి వచ్చిన త్వరతి కాలంలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో వడ్డెపల్లిలో రూ.143లక్షలతో దావఖన కూడా నిర్మిచడం జరుగుతుందని తెలిపారు.వడ్డేపల్లి చెరువు మత్తడి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎలకంటి నాగరాజు, డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్, తాళ్లపల్లి సుధాకర్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రవీందర్, మేరీ,మందల సమ్మయ్య,సోషల్ మీడియా నెహల్, మిడిదొడ్డి బిక్షపతి, గోపాల కిషన్, ఏనుకోటి కుమారస్వామి,అశోక్, ఏనుకొటి కిట్టు,అన్ని కుల సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.